క్లుప్తంగా

ఇసుక డంప్‌ల పరిశీలన



అనంతారంలో ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారంలో గతంలో సీజ్ చేసిన ఇసుక డంప్‌లను శనివారం మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుతం 700 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు తెలిపారు. దీనిపై పూర్తి వివరాలను జిల్లా అధికారులకు తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వసుమతి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్‌బాబా ఉన్నారు.

పేదల ఇళ్లపై దాడులు ఆపాలి

భానుపురి : సూర్యాపేట పట్టణంలో సద్దులచెరువు సమీపంలో ఉన్న ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయని, మూడు రోజులుగా చేస్తున్న సర్వేను ఆపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 50 సంవత్సరాల నుంచి ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలను రోడ్డున పడేసి, వారి బతుకులతో ఆటలాడుకోవద్దన్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నాయని విమర్శించారు. ఇంటిపన్నులు ఎందుకు కట్టించుకుంటున్నారని, పేదల ద్వారా ఆదాయాన్ని గుంజుకొని ప్రస్తుతం రోడ్డున పడేసే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు.

టీకాలు వేయించాలి

అర్వపల్లి : పెంపుడు కుక్కలకు యజమానులు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలను వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. అర్వపల్లిలోని పశువైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకా శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పార్వతి, యాకయ్య, యజమానులు సైదులు, ప్రభాకర్, జలందర్, సూర్యకళ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : పెంపుడు కుక్కలకు వ్యాధులు సోకకుండా రేబిస్ టీకాలను వేయించాలని తుంగతుర్తి పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. శనివారం ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నరేష్, సిబ్బంది మహేందర్, బుచ్చిబాబు, గణేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

అర్వపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ అన్నారు. షీటీం ఎస్‌ఐ నీలిమ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందంతో కలిసి శనివారం అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలో సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ శిరీన్, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గో పయ్య, గురులింగం, కృష్ణ, నాగార్జున పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లలు మృతి

ఆత్మకూర్ (ఎస్) : కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఏనుబాముల గ్రామంలో తగుల జనార్దన్ తన గొర్రె పిల్లలను శనివారం ఇంట్లో ఉంచి గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. అయితే కుక్కలు ఇంట్లో ఉన్న ఆరు గొర్రె పిల్లలపై దాడిచేసి చంపివేశాయి.

ఉచిత వైద్యశిబిరం

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బందికి శనివారం ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిడి బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నూతనకల్ : జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో పెద్ద నెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ రాములునాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వృక్షో రక్షతి రక్షితః అనే అంశంపై ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధరావత్ శివయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు హరికృష్ణ, చవగాని వెంకయ్యగౌడ్, ఉమారాణి, సువర్ణలక్ష్మి, షమీమ్, సుల్తానా, విజయలక్ష్మి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

అక్షర ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్సీ కోదండరాం

సూర్యాపేటటౌన్ : అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదహారేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ కోదండరాం ప్రశంసించారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అక్షర ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టీచర్లు ఒక వేదికగా ఏర్పడి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని వైద్యం, విద్య తదితర సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. అక్షర ఫౌండేషన్ లాంటి సంఘాలు రాష్ట్రంలో మరిన్ని రావాలని ఆకాంక్షించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు ఎక్కువగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టి విద్యారంగ సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. అలాగే పలువురికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా వాసుదేవ్, ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, కుంట్ల ధర్మార్జున్, డాక్టర్ సుధీర్‌కుమార్, తంగెళ్ల జితేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఉప్పు నాగయ్య, తిరుమల్‌రెడ్డి, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



భానుపురి : వినతిపత్రం అందిస్తున్న ఐఎఫ్‌టీయూ ప్రతినిధి బృందం సభ్యులు

కోదండరాంకు పలువురి వినతి..

భానుపురి : సూర్యాపేటలో జరిగిన టీజేఎస్ జిల్లా ప్లీనరీకి హాజరైన ఎమ్మెల్సీ కోదండరాంకు వినతులు అందించేందుకు వివిధ సంఘాల నాయకులు శనివారం పట్టణంలోని జే ఫంక్షన్ హాల్‌కు తరలివచ్చారు. రాష్ట్రంలో కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో మహిళా కార్మికుల వేతనాలను రూ.26 వేలకు పెంచాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని విరమించుకోవాలని, తదితర సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ప్రతినిధి బృందం సభ్యులు కోదండరాంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, సహాయ కార్యదర్శి దేశోజు మధు, దండి ప్రవీణ్ పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ప్రకటించిన డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసేలా చూడాలని కోరుతూ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ వినతిపత్రం అందించారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిల అఖిల్, దాసరి దేవయ్య, ఏడిండ్ల అశోక్, ఎడ్ల ముక్కంటి, కాశీమళ్ల వెంకట నర్సయ్య, గాజుల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం..

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్లను విడుదల చేయించాలని కోరుతూ పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం సభ్యులు వినతిపత్రం అందించారు. అలాగే సూర్యాపేటలో ప్రభుత్వ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీలను ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటటౌన్ : అక్షర పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం



సూర్యాపేటటౌన్ : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాజీమార్గమే రాజ మార్గం

- తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫర్హీన్ కౌసర్

తుంగతుర్తి : రాజీ మార్గమే రాజ మార్గమని తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్ అందరికీ రాజీమార్గాన్ని కుదిరించే ఒక ఆయుధమన్నారు. పంతాలకు పోయి వైరుధ్యాలను పెంచుకోవద్దని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీపడి కేసులు పరిష్కరించుకొని అందరూ స్నేహ పూర్వకంగా కలిసి, మెలిసి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు సతీష్, అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, రాజారాం, రవి కుమార్, వజీర్, నాగరాజు, మహేష్, సీఐలు శ్రీను, రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఏడుకొండలు, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్, అంజయ్య పాల్గొన్నారు.



తుంగతుర్తిలోని కోర్టులో లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ఫర్హీన్ కౌసర్

యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

భానుపురి : భగత్‌సింగ్ కలలు కన్న స్వాతంత్య్ర ఫలాలు నేటికీ యువతకు అందకపోవడం బాధాకరమని, భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సూర్యాపేట పట్టణ కార్యదర్శి ఏడెల్లి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని డీమార్ట్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ ముష్కరులను తరిమికొట్టిన వ్యక్తుల్లో భగత్ సింగ్ ప్రథముడన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బూర సైదులు, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు నిమ్మల ప్రభాకర్, పట్టణ కోశాధికారి తాళ్ల సైదులు, నవీన్, నజీర్ పాల్గొన్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో..

పట్టణంలోని కొత్తబస్టాండ్ సెంటర్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, నాయకులు చామకూరి నరసన్న, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ నాగేందర్ నాయక్‌లు మాట్లాడారు. స్వాతంత్య్ర ఉద్యమంలో భగత్ సింగ్ పోరాటాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాధవరెడ్డి, నాయకులు గుండ్ల సైదులు, కోటన్న, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అక్రమ అరెస్టులను నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శాంతియుతంగా విద్యార్థి మహాగర్జన సభను నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను, విద్యార్థులను అక్రమ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బానోతు వినోద్ కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అక్కినపల్లి వినయ్, సుమన్, శ్రీను, రవి, మహేష్, గోపి, శివ, విగ్నేష్, నాగేష్ పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపల్లి శివకుమార్, తదితరులు

చివ్వెంల : సత్యశోధక్ సమాజ్ ఉద్యమ స్ఫూర్తితో కుల నిర్మూలన ఉద్యమాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. శనివారం కుడకుడ గ్రామంలోని లెనిన్ నగర్‌లో నిర్వహించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆనాడు భారతదేశంలో పెను విప్లవాలకు నాంది పలికిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, చంద్రకళ, సూరం రేణుక, లింగయ్య, వీరబాబు, జయమ్మ, సంతోషిమాత, పద్మ, నర్సయ్య, యల్లమ్మ, కల్పన, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న అనురాధ

నాగారం : మహిళల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మహిళా డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని తెలిపారు. ప్రతి మహిళా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తోట జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో 'మాక్ పోలింగ్'

ఆత్మకూర్ (ఎస్) : ఎన్నికల నిర్వహణ, ప్రొసీడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ప్రధానోపాధ్యాయుడు శ్రావణ్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎన్నికల అధికారులుగా, అభ్యర్థులుగా, పోలింగ్ ఏజెంట్లుగా పనిచేయించారు. పోటీ చేసిన అభ్యర్థులు, గెలుపొందిన అభ్యర్థులు ఏ విధమైన నియమావళి పాటించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు, గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించడం, ప్రమాణ స్వీకారం చేయడం వంటి తదితర అంశాలను స్వయంగా విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మల్లీశ్వరి, యాదమ్మ, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, చంద్రశేఖర్, అన్నపూర్ణాచారి, దుర్గా ప్రసాద్ రెడ్డి, మల్లారెడ్డి, శిరీష, రఘు, రమేష్, రామచంద్రయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ జనార్దన్ అన్నారు. శనివారం ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్‌లో నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించి సామర్థ్యాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెంట్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రభాకర్, మండల నోడల్ అధికారి వి.మురళీకృష్ణ, ఎంఈఓ ధారాసింగ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, వెంకటయ్య, శ్రవణ్ కుమార్, భాషిత్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టీ.వాసుదేవరెడ్డి, ఎస్.చొడర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, జె.వెంకటరెడ్డి, యోగానంద చారి, డి.జోహార్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



నూతనకల్ : కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్



మద్దిరాల : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నూతనకల్ : పేదింటి ఆడపిల్లలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన 61మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, తీగల గిరిధర్‌రెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, పన్నాల రమామల్లారెడ్డి, పసుల అశోక్ యాదవ్, నకిరేకంటి మధు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మద్దిరాల : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజానాయక్ తండాలో వ్యవసాయ భూములకు ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మండలానికి చెందిన ఏడుగురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, నాయకులు పచ్చిపాల వెంకన్న, కొంపెల్లి మల్లారెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌గౌడ్, నాగు నాయక్, లింగనాయక్, సీతారాములు, సుధాకర్, శ్రీను, కొమ్ము అంజయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తుది ఓటరు జాబితా ప్రదర్శన

నూతనకల్ : మండల పరిషత్ కార్యాలయంతో పాటు మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో శనివారం ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాను సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓల సమక్షంలో ప్రదర్శించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శనివారం తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తుది జాబితా ప్రకారం మండల వ్యాప్తంగా మొత్తం 24,018మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 11,900 మంది పురుషులు, 12,118 స్త్రీలు ఉన్నారు.



నూతనకల్‌లో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సునీత, అధికారులు

ప్రశస్త్ యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



అర్వపల్లి ఎమ్మార్సీలో యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ బాలునాయక్



నాగారంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

అర్వపల్లి : ప్రశస్త్ యాప్‌పై మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీలో శనివారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ఉన్న లోపాలను ఈ యాప్ ద్వారా సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, రిసోర్స్ పర్సన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం : పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వారిని ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయాలని ఎంఈఓ వాసం ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు ప్రశస్త్ యాప్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 21 రకాల దివ్యాంగ పిల్లలను గుర్తించి వారిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రశస్త్ యాప్‌లో 21 రకాల వైకల్యాలకు సంబంధించి 63 రకాల ప్రశ్నలు ఉంటాయని, విద్యార్థులను పరీక్షించి యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరచారి, వెంకటేశ్వర్‌రెడ్డి, జీహెచ్‌ఎం విష్ణుమూర్తి, రిసోర్స్‌పర్సన్ బి.భాస్కర్, ఐఆర్పీ ఎస్‌కె.బాషా పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ

నాగారం : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేటలో జరిగిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో పసునూర్ మోడల్‌స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థిని సుమన ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ చంద్రబాబు తెలిపారు. శనివారం పసునూర్ మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బృందం అభినందించి షీల్డ్‌ను అందించారు.

జీఓ 25ని సవరించాలి

మద్దిరాల : జీఓ నంబర్ 25ని సవరించాలని టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం కుక్కడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి నాగయ్య, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవీందర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మద్దిరాల: మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కుక్కడం ఆవాస గ్రామం రాజగానితండాలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. రాజగానితండాకు చెందిన లాకవత్ శ్రీను,లాకవత్ రవి, లాకవత్ రెడ్యా మధ్య కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. గతంలో ఒకరిపై ఒకరు కేసులు కూడా పెట్టుకున్నారు. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందిన లాకవత్ శ్రీను శనివారం తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న 'పోషణ అభియాన్'

తుంగతుర్తి : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ శ్రీజ అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రమీల, ఖైరున్నీసా, అనురాధ, మంగమ్మ, అనిత, శివశంకర్, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లోయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార ప్రదర్శన, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వల్లపు నాగమణి, ఆయా సోమమ్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

నాగారం : పర్యావరణ పరిరక్షణ పట్ల పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సభ్యులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు మొక్కల పెంపకం చేపట్టి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో ఎర్త్ లీడర్స్‌ను ఎన్నుకొని, పాఠశాల ఆవరణలో ఉన్న మర్రి చెట్టును ఎర్త్ ట్రీగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ బృందం సభ్యులు నగేష్, అనుదీప్, శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.